వ్యాపారం. చలి కాలం, ఎండా కాలాల్లో అసలు ఆదాయం ఉండదు. అందుకని నాకు అన్ని కాలాల్లో విచారంగా ఉంటుంది." వివరించింది ఆ ముసలావిడ.

సాధువు కొద్ది క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"ఎండ బాగా ఉన్న రోజుల్లో మీ పెద్దల్లుడి ఐస్ క్రీం వ్యాపారం బాగా అభివృద్ధిలో ఉందని అనుకో. అప్పుడు నీకు సంతోషం కలుగుతుంది. అలాగే వర్షాకాలంలో నీ రెండో అల్లుడి గొడుగుల వ్యాపారంలో బాగా లాభాలు వస్తున్నాయని అనుకో. అప్పుడు నీకు సంతోషం కలుగుతుంది."

"అర్ధమైంది స్వామి."

ఆ తర్వాత ఆ ముసలావిడ పెద్దగా దుఃఖాన్ని అనుభవించలేదు. ఇలాగే జీవితంలో మనకి ప్రతికూలమైన వాటిగురించి ఆలోచించి బాధ పడుతూ, మనకి అనుకూలమైన వాటి వల్ల కలిగే ఆనందాన్ని మనం తరచు విస్మరిస్తూంటాం. అన్నిటినీ అనుకూలంగా అన్వయించుకోవడమే ఆధ్యాత్మికత అంటే.

## 88. సత్యం

ఓ సూఫీ మహాత్ముడు ఓ నది ఒడ్డున గల ఓ చిన్న కుటీరంలో జీవిస్తూ దైవ ధ్యానం చేసుకుంటున్నాడు. ఓ రోజు ఓ తల్లి తన రెండేళ్ళ పిల్లని తెచ్చి అతని దగ్గర వదిలి అడిగింది.

"స్నానం చేసి వస్తాను. నేను వచ్చే దాకా నా బిడ్డని చూసుకుంటారా?"

ఆ మహాత్ముడు బదులుగా తలని వూపాడు. ఆమె బిడ్డని వదిలి వెళ్ళిపోయింది. గంటైంది. రెండు గంటలు దాటాయి. ఆమె రాలేదు. ఆ రోజు గడిచినా రాలేదు. వారం గడిచినా రాలేదు. వారాలు నెలలు, నెలలు సంవత్సరాలు అయ్యాయి కాని ఆమె రాలేదు.

ఆ సూఫీ మహాత్ముడు ఆ పిల్లని జాగ్రత్తగా పెంచసాగాడు. ఆమెకి పదహారేళ్ళు వచ్చాక ఓ రోజు ఆ పిల్ల తల్లి వచ్చి తన బిడ్డని చూసి, కౌగలించుకుని ఆనంద భాష్పాలు రాల్చింది.

"నా బిడ్డని నా వెంట తీసుకువెళ్తున్నాను." చెప్పిందామె.

ఆ సూఫీ మహాత్ముడు సరేనన్నట్లుగా తల ఊపాడు. ఆమె తన బిడ్డతో వెళ్ళిపోయింది. ఆమెని ఆయన ఒక్క ప్రశ్న వేయలేదు, ఒక్క మాట మాట్లాడలేదు. కనీసం ఆమె నించి కృతజ్ఞతని కూడా ఆయన ఎదురు చూడలేదు. ఆ బిడ్డ తన దగ్గరకి రాక మునుపు ఆయన మనఃస్థితి ఎలా వుందో ఇప్పుడూ అలానే వుంది. ఇంతకాలం ఆ పాప సాన్నిహిత్యం ఆయన్ని ఏం మార్చలేదు. ఎందుకంటే వచ్చినది ఏదైనా సరే పోతుందన్న సత్యం ఆయనకి తెలుసు.

## 89. ఆ ముగ్గురూ

తన రాజ్యంలోని ప్రజలు ఎలాంటివారో స్వయంగా తెలుసుకోడానికి ఓ రాజు తన మంత్రితో ఓ రాత్రి మారువేషంలో వెళ్ళాడు. ఓ ఇంటి తలుపు తట్టాడు. ఆ ఇంటతను తలుపుతీయకుండానే 'ఎవరు?' అని ప్రశ్నించగానే చెప్పాడు.

"మేం ప్రయాణీకులం. ఈ రాత్రి మీ అతిథులుగా మీ ఇంట్లో వుండ నిస్తారా?"

"మీరు దొంగలో, ఎలాంటివారో నాకేం తెలుసు? కుదరదు." తలుపు తీయకుండానే లోపలనించి జవాబు చెప్పాడు ఆ ఇంటి యజమాని.

రాజు, మంత్రి వెళ్ళి ఇంకో ఇంటి తలుపు తట్టారు. ఆ ఇంటి యజమాని తలుపు తీసి అడిగాడు.

"ఎవరు మీరు? ఎందుకు తలుపు తట్టారు?"

"పొరుగూరు నించి వచ్చాం. ఈ రాత్రికి మీ ఇంట్లో ఆతిథ్యం, ఆశ్రయం కోరుతున్నాం."

"మీరు ఎంతమందో చెప్పండి. అప్పుడు ఆలోచించి చెప్తాను." బదులు చెప్పాడతను.

"మేం ఇద్దరం."

"ఐతే తలో రెండు మొహర్లు చెల్లించి లోపలకి రండి." ఆహ్వానించాడు అతను.

"మా దగ్గర డబ్బు లేదు."